పశుగ్రాసం కొరత..



హిప్నెల్లి శివారులోని అటవీ ప్రాంతంలో తిరుగుతున్న పశువులు

- పశువులను అమ్ముకుంటున్న పాడిరైతులు
- పక్క రాష్ట్రం నుంచి గ్రాసం కొనుగోలు
- ఇక్కట్లు పడుతున్న పోషకులు

తానూరు: మండలంలోని పాడిరైతులను పశుగ్రాసం కొరత వేధిస్తోంది. ఆయా గ్రామాల్లో పశుగ్రాసం దొరకకపోవడంతో మూగజీవాలు అల్లాడుతున్నాయి. వానాకాలంలో పంటల నుంచి వచ్చిన గ్రాసం సరిపోకపోవడంతో స్థానిక రైతులు వేలాది రూపాయలకు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్, బన్నెల్లి, కర్కెలి, సావర్గాం తదితర ప్రాంతాల నుంచి పెద్దజొన్న కట్టలను.. నిజామాబాద్, బోధన్ ప్రాంతాల నుంచి వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు.

తగ్గిపోయిన పంటల సాగు..

అధిక వర్షాల కారణంగా మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన జొన్న పంటలు చేతికి రాలేదు. ప్రస్తుత వేసవికాలం ప్రారంభం నుంచే భూగర్భజలాలు అడుగంటాయి. బోరుబావుల్లో నీటి లభ్యత తక్కువ ఉండటంతో రైతులు పెద్ద జొన్న పంటను తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. కొన్ని ప్రాంతాల్లో సాగు చేసిన జొన్న పంట నీటి వసతి లేక ఎండిపోయింది. గతంలో తానూరు మండలంలోని జౌలా(బి), ఎల్వత్, వడ్గాం, జౌలా(కే) గ్రామాల్లో గడ్డి లభించేది. ఈ ఏడాది అధికశాతం మంది రైతులు శనగ పంట సాగు చేయడంతో పెద్ద జొన్న సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.



బోధన్ నుంచి వరి గడ్డి తీసుకెళ్తున్న బెంబర రైతు

బాధతో అమ్ముకుంటున్న రైతులు..

రెండేళ్లుగా మండలంలో పశుగ్రాసం కొరత ఉంటుంది. దీంతో కొందరు పాడిరైతులు తమ పశువులను సంతకు తరలించి అమ్ముకుంటున్నారు. ఒక్కోసారి గ్రాసాన్ని కొందామన్నా.. దొరకడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మహారాష్ట్ర కర్కెల్లి నుంచి ట్రాక్టర్‌లో చొప్ప తీసుకొస్తున్న బోరిగాం రైతులు

ఇతర ప్రాంతాల నుంచి గ్రాసం తెచ్చుకుంటున్న రైతులు..

ప్రస్తుతం మహారాష్ట్రలో పెద్ద జొన్న కట్ట రూ.30 నుంచి రూ.40 వరకు ఉండగా వరిగడ్డి కట్టకు రూ.80 నుంచి రూ.100 వరకు పలుకుతోంది. అలాగే మొక్కజొన్న కట్టకు రూ.15 నుంచి రూ.20 వరకు పలుకుతున్నట్లు స్థానిక రైతులు పేర్కొంటున్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై వరిగడ్డిని తెచ్చుకుంటున్నారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్, రత్నెల్లి, బాలాపూర్ గ్రామాల నుంచి రైతులు ఎడ్లబండ్లు, ఆటోలపై జొన్నకట్టలను తెచ్చుకుంటున్నారు.

గ్రాసాన్ని కొనే స్థోమత లేని రైతులు తాము అల్లారు ముద్దుగా పెంచుకున్న మూగజీవాలను బాధతో విక్రయిస్తున్నారు.

సకాలంలో గడ్డి విత్తనాలు అందించాలి..

పశుసంవర్ధకశాఖ, ఉపాధిహామీ పథకం కింద సంబంధిత అధికారులు.. పాడి రైతుల కోసం గడ్డి విత్తనాలను రాయితీపై పంపిణీ చేసేవారు. కానీ వాటిని సకాలంలో పంపిణీ చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈఏడాది బోరుబావుల్లో నీరు అడుగంటడంతో పంటలు ఎండిపోయి పశుగ్రాసం ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయింది. ప్రభుత్వం పశుగ్రాసం కొరతను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేసున్నారు.

పశువులను అమ్మేస్తున్నారు



పశువులకు మేత దొరకకపోవడంతో అంగడికి తీసుకెళ్లి అమ్మేస్తున్నారు. ఈసారి భూమిలో తేమ లేకపోవడంతో యాసంగి పంటలు ఎండిపోయాయి. దీంతో జీవాలకు గడ్డి దొరకడం లేదు. అధికారులు సకాలంలో గడ్డి విత్తనాలను పంపిణీ చేసి ఆదుకోవాలి. – గణేశ్, రైతు, బోరిగాం

ధర ఎక్కువైనా కొంటున్నాం



పశువుల కోసం ధర ఎంత ఎక్కువైనా గడ్డిని కొనక తప్పడం లేదు. అధిక రూపాయలు వెచ్చించి ఎడ్లబండిపై, ట్రాక్టర్లపై గడ్డిని తెచ్చుకుంటున్నాం. అధికారులు స్పందించి రైతులకు సకాలంలో సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందించి సమస్య పరిష్కరించాలి. – అశోక్, రైతు, హిప్నెల్లి

సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందిస్తాం

రైతులకు పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నాం. కావాల్సిన రైతులు తానూరు, భోసి పశువైద్యశాలలో విత్తనాలు పొందాలి. – రాజేశ్, పశువైద్యాధికారి

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు పది మంది గైర్హాజరు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ పరీక్షలకు 506 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10 మంది గైర్హాజరయ్యారు. శనివారం ఇంటర్ రెండో సంవత్సరం జువాలజీ, మ్యాథ్స్-2బీ, హిస్టరీ పరీక్షలు జరిగినట్లు కళాశాలల ప్రిన్సిపాళ్లు అబ్దుల్ హమీద్, భూక్య రమేశ్ నాయక్ తెలిపారు.

అధికారుల పర్యటన



నీటి సమస్య తెలుసుకుంటున్న అధికారులు

తానూరు: మండలంలోని బోరిగాం గ్రామంలో శనివారం ఎంపీడీవో నసీరొద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పృథ్వీ పర్యటించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. న్యూకాలనీ, జిల్లా పరిషత్ పాఠశాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. కాలనీలో ట్యాంకులకు, పాఠశాలలో నల్లా ఏర్పాటు చేసి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పేర్కొన్నారు.

లక్ష్మణచాంద ఎస్సై బదిలీ

లక్ష్మణచాంద:మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేసే సుమలత శనివారం బదిలీ అయ్యారు. మండలానికి మొదటి మహిళా ఎస్సై సుమలత 2024 జూన్ 9న బాధ్యతలు స్వీకరించారు. సుమలత జిల్లాకేంద్రంలోని భరోసా కేంద్రానికి బదిలీ అయ్యారు.

మరుగుదొడ్ల నిర్మాణంపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి రాజబాపు

కుంటాల: మండలకేంద్రమైన కుంటాలలో ఐదేళ్ల కిందట స్వచ్ఛభారత్ మిషన్ పథకంలో భాగంగా అర్హులు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. కానీ కొందరికీ బిల్లులు చెల్లించలేదు. శనివారం పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేసి లబ్ధిదారుల వివరాలను సేకరించారు.

ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ హోమం జరిపించారు. సమీప ప్రాంతాల్లోని భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, రత్నయ్య తదితరులున్నారు.

భీమ్ దీక్షలు ప్రారంభం



దీక్షలు స్వీకరిస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం భీమ్‌దీక్షలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 14వరకు దీక్షలు కొనసాగుతాయని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) సెంట్రల్ టీచర్ బుద్ధాచార్య, నాయకులు చాకెటి లక్ష్మణ్ చేతుల మీదుగా ఎస్.శేఖర్, బి.గోపి, కె.మహేందర్ దీక్షలు స్వీకరించారు. ఈసందర్భంగా టీచర్ మాట్లాడుతూ దీక్షాపరులు తెల్లని దుస్తులు ధరించి.. మద్యం, మాంసాహారానికి దూరం ఉండాలని పేర్కొన్నారు.

ఎండిపోయిన చెక్‌డ్యాం



నీరు లేక వెలవెలబోతున్న చెక్‌డ్యాం

కుంటాల: భూగర్భజలాలు పెంచి, ఒండ్రు మట్టి తరలిపోకుండా మండలంలోని కల్లూరు వాగుపై రూ.కోటి 20 లక్షల ఇరిగేషన్ నిధులతో చెక్‌డ్యాం నిర్మించారు. కానీ పర్యవేక్షణ లోపంతో నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టారు. దీంతో వేసవి ఆరంభంలోనే చుక్క నీరు లేక ఎండిపోయింది. దీంతో మూగజీవాలు దాహం తీర్చుకునేందుకు అల్లాడిపోతున్నాయి. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



మహరాజ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: యువత చెడు అలవాట్లకు దూరం ఉండి సన్మార్గంలో నడవాలని గురు ప్రేమ్‌సింగ్ బాపు మహరాజ్ అన్నారు. శనివారం మండలంలోని మహాగాం గ్రామ విఠలేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత భావనలు అలవర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మోతీలాల్ మహరాజ్, ధర్మపురి, అయిల సాయినాథ్, గిరి సత్యానంద్, వామంగిరి మహరాజ్, భోజారాం, శంకర్, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా 'సమీకృతం'



భైంసాలో అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

- భైంసా మిర్చియార్డులో మార్కెట్ నిర్మాణం
- నిధులు లేక నిలిచిన పనులు
- పూర్తి చేయాలంటున్న ప్రజలు, చిరువ్యాపారులు

భైంసాటౌన్: పట్టణంలోని ఏఎంసీ(వ్యవసాయ మార్కెట్ కమిటీ)కి చెందిన మిర్చియార్డు స్థలం రెంటికి చెడ్డ రేవడిలా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీల్లో వెజ్(కూరగాయలు), నాన్‌వెజ్(మాంసం), పండ్లు, పూలు ఒకే చోట విక్రయించేలా ఇంటిగ్రేటెడ్(సమీకృత) మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా భైంసాకు రూ.7.20 కోట్లతో సమీకృత మార్కెట్‌ను మంజూరు చేశారు. భైంసాలోని మిర్చియార్డు ఆవరణలో 33 గుంటల స్థలంలో 2021లో పనులు సమీకృత వ్యవసాయ మార్కెట్ ప్రారంభించారు. దాదాపు సగభాగం వరకు పనులు పూర్తయ్యాయి. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీనికితోడు భవన నిర్మాణం కోసం కేటాయించిన ఏఎంసీ స్థలం నిష్ప్రయోజనంగా మారగా.. మార్కెట్ నిర్మాణం కోసం ఏఎంసీకి చెందిన దుకాణ సముదాయాన్ని సైతం కూల్చివేశారు.

స్థలం పాయె.. అద్దెలు పోయె..!

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం భైంసా ఏఎంసీకి చెందిన పట్టణంలోని మిర్చియార్డులో 33 గుంటల స్థలం కేటాయించారు. ఇందుకోసం ఏఎంసీకి చెందిన దాదాపు పదికిపైగా దుకాణాలనూ కూల్చివేశారు. ఈ దుకాణాల అద్దెల ద్వారా ఏఎంసీకి ఆదాయం చేకూరేది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం వీటిని కూల్చియాల్సి వచ్చింది. అలాగే పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనాన్ని సైతం కూల్చివేశారు. మార్కెట్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే ప్రయోజనకరంగా ఉండేది. కానీ పనులు నిలిచిపోవడంతో మార్కెట్ అందుబాటులోకి రాకపోగా, ఏఎంసీ స్థలం, దుకాణాల కూల్చివేతతో అద్దెల రూపంలో ఆదాయం కోల్పోవడం గమనార్హం.

వినియోగంలోకి తెస్తేనే..

డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలో ప్రతి సోమవారం వారసంత నిర్వహిస్తారు. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూరగాయలు విక్రయించేందుకు రైతులు, వ్యాపారులు వస్తుంటారు. అంతేకాక పట్టణంలో ప్రధాన రోడ్ల వెంబడి పండ్లు, పూలు, చికెన్, మటన్, ఫిష్ వ్యాపారులు దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే, అందులోనే వెజ్, నాన్‌వెజ్‌తోపాటు పూలు, పండ్ల దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పనులు నిలిచిపోవడంతో, రోడ్ల పక్కన కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్ వంటి వ్యాపారాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు కల్గుతుందని పలువురు పేర్కొంటున్నారు.

పెట్రోకార్ విధుల్లో మహిళా కానిస్టేబుళ్లు



కుంటాల : పత్రాలు అడుగుతున్న కానిస్టేబుళ్లు



కడెం: అవగాహన కల్పిస్తున్న కానిస్టేబుళ్లు



మామడ : వివరాలు తెలుసుకుంటున్న సిబ్బంది



దస్తురాబాద్‌లో..



తానూరు: తనిఖీ నిర్వహిస్తున్న సిబ్బంది

కుంటాల: జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు నారీశక్తి కార్యక్రమంలో భాగంగా కుంటాల పోలీస్‌స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుళ్లు సవిత, అశ్విని శనివారం పెట్రోకార్ విధులు నిర్వర్తించారు. కల్లూరు 61 జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేసి.. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఏఎస్సై జీవన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ముథోల్‌కు వెళ్లే రోడ్డుపై శనివారం మహిళా కానిస్టేబుళ్లు పెట్రోకార్ విధులు నిర్వర్తించారు. వాహనాల తనిఖీ నిర్వహించి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎస్సై శ్రీనివాస్, మహిళా కానిస్టేబుళ్లు వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సు, బీమా పత్రాలను పరిశీలించారు. ఏఎస్సై శ్యామూల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: నారీశక్తి కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో మహిళా కానిస్టేబుళ్లు కె.రజిత, ఎ.కల్యాణి పెట్రోకార్ విధులు నిర్వర్తించారు. శనివారం బ్లూకోల్ట్ విధులు, వాహనాల తనిఖీ, డయల్ 100 విధులు నిర్వహించారు.

ముథోల్: మండలకేంద్రంలో బ్లూకోల్ట్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. నారీశక్తిలో భాగంగా మహిళా కానిస్టేబుళ్లు పెట్రోకార్ విధులు నిర్వర్తించారు.

ఖానాపూర్: నారీశక్తిలో భాగంగా ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పని చేసే మల్లేశ్వరి, శ్రావణికి పెట్రోకార్ విధులు అప్పగించామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. డయల్ 100 విధులు, రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగంపై ప్రజలు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

మామడ: మండలకేంద్రంలో శనివారం మహిళా కానిస్టేబుళ్లు పెట్రోకార్ విధులు నిర్వహించారు. వాహనాల తనిఖీ నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధరణి ప్రసన్న పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: నారీశక్తిలో భాగంగా మహిళా కానిస్టేబుళ్లు పెట్రోలింగ్ విధులు నిర్వర్తించారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రోడ్లపై నిలిపి ఉంచిన తోపుడుబండ్లను తొలగింపజేశారు.

కడెం: నారీశక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళా కానిస్టేబుళ్లు బ్లూకోల్ట్, పెట్రోలింగ్ విధులు నిర్వహించినట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో బస్టాప్ వద్ద మహిళలకు గొలుసు దొంగతనాలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కిరణ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు




ముథోల్: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావు

ఖానాపూర్: పట్టణంలోని పలు బాధిత కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరామర్శించారు. శివాజీనగర్ కాలనీకి చెందిన అమంద కిరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలను ఆర్థికసాయంగా అందించారు. శాంతినగర్ కాలనీకి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మదిరె చిన్నపెద్దులు మృతి చెందగా అతని కుమారుడు సత్యనారాయణను పరామర్శించారు. అనంతరం భిక్కునూరి రమేశ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, రమేశ్, నాయకులు రాజేశ్వర్, సంతోశ్ తదితరులు ఉన్నారు.

ముథోల్: మండలంలోని తరోడాలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ సాయాగౌడ్ కుటుంబసభ్యులను శనివారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించాడు. మృతికి కారణాలను తెలుసుకున్నారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, నాయకులు రవి, ఉమేశ్ తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. దెబ్బతిన్న రోడ్డుతో ప్రమాదాలు



తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామం నుంచి భైంసా మండలం ఇలేగాం గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు వద్ద భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాత్రి వాహనదారులు దెబ్బతిన్న రోడ్డుపై అదుపు తప్పి కింద పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : కమలాకర్, పీఆర్ డీఈ, ఫోన్: 91211 35604

'వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి'



కుభీర్: శిక్షణ ప్రారంభిస్తున్న ఎంఈవో



సత్తన్‌పల్లిలో తరగతులు పరిశీలిస్తున్న ఎంఈవో

కుభీర్: తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మాలేగాం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్(అభ్యాసన సామర్థ్యాలు)పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో ప్రారంభించారు. 3,4,5 తరగతుల విద్యార్థులను చదవడం, రాయడంతోపాటు గణితంలో చతుర్విధ ప్రక్రియలు నేర్చుకునేలా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులకు రెండు రోజులు శిక్షణనిస్తారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం షకీలా, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అనిరుధ్, సీఆర్పీ రవీందర్, ఉపాధ్యాయురాలు రజిత ఉన్నారు.

ఖానాపూర్: తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో ప్రేమ్‌సాగర్ అన్నారు. మండలంలోని సత్తనపల్లి, బీర్నంది, రాజురా గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించామని ఎంఈవో పేర్కొన్నారు. ఎఫ్ఎల్ఎన్ అసెస్‌మెంట్‌లో భాగంగా అభ్యసన సామర్థ్యంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి కంప్యూటర్ ఆధారిత బోధన అందించేందుకు ఈ తరగతులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక తరగతులను పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులను కోరారు.

భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు

ఖానాపూర్:పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని అన్నపూర్ణ మహాదేవ ఆలయంలో శనివారం రాత్రి సాంస్కృతిక భజన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని మస్కాపూర్ శ్రీరామ భజన బృందం ఆధ్వర్యంలో రాత్రి భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించారు.

'ఛావా' సినిమా తిలకించిన విద్యార్థులు



ఇగ్లూ థియేటర్ వద్ద విద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు శనివారం గ్రామంలోని ఇగ్లూ థియేటర్‌లో చారిత్రక నేపథ్యం కలిగిన ఛావా సినిమాను తిలకించారు. మస్కాపూర్‌కే చెందిన చిలుకూరి తిరుమలగిరి కూతురు అదే పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. శనివారం మధ్యాహ్నం పాఠశాలకు సెలవు ఉండటంతో ఉపాధ్యాయుల అనుమతి తీసుకొని తిరుమలగిరి తన కూతురితోపాటు తరగతిలోని 90 మంది విద్యార్థులను సినిమా తీసుకెళ్లారు.